క్లుప్తంగా

కంపోస్టు యార్డు పరిశీలన



దంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణ శివారులోని మున్సిపల్ కంపోస్టుయార్డును కమిషనర్ మల్లికార్జున, ఎంఈ గురప్పయాదవ్ గురువారం పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెడిపోయిన బోర్లు మరమ్మతులు చేయించి చెట్లకు నీరు సవ్యంగా పారేటట్టు చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రాజేంద్రనగర్‌లో రోడ్డు, డ్రైనేజీకి అడ్డంగా వేసిన మట్టిని తొలగించుకోవాలని ఇంటియజమానికి సచివాలయ సిబ్బంది ద్వారా నోటీసు అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: బాచుపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మాపురం గ్రామానికి చెందిన చిరంజీవి తన పుట్టినరోజు కావడంతో స్నేహితుడు రాజశేఖర్‌తో కలసి బాచుపల్లిలోని బాట సుంకులమ్మ ఆలయానికి బయలుదేరారు. వేగంగా వెళ్తున్న వారి ద్విచక్రవాహనం అదుపుతప్పికిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



మద్యం సీసాలను చూపుతున్న ఎస్‌ఐ ధరణీబాబు

యల్లనూరు: అక్రమంగా మద్యం అమ్ముతున్న తిమ్మంపల్లికి చెందిన మేకల రామకృష్ణ, శింగవరం గ్రామానికి చెందిన రామాంజనేయులును అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ధరణీబాబు గురువారం తెలిపారు. నిందితుల నుంచి 12 మద్యం బాటిళ్లు, 29 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని కుంటలో మద్యం విక్రయిస్తున్న శ్రీరంగ అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు గుత్తి సెబ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. నిందితుడి నుంచి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆణిముత్యాలను వెలికితీయడానికే 'ఆడుదాం ఆంధ్రా'



బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: గ్రామాలు, పట్టణాల్లోని గల్లీలకే పరిమితమైన ప్రతిభావంతులైన క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడానికే జగనన్న ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా క్రీడా సంబరాలను నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్ క్రీడామైదానంలో భాగ్యనగర్ సచివాలయాల పరిధిలో గల క్రీడాకారులకు క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. దేశచరిత్రలోనే ఈ క్రీడాసంబరం మైలురాయిగా నిలిచిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి, పీఈటీలు వేణుగోపాల్, తబిత, మంజువాణి తదితరులు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

యాడికి: రైతులు కంది పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. గురువారం పుప్పాల గ్రామంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా రైతులు సాగు చేస్తున్న కంది పంటలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. పంటలో శనగపచ్చ పురుగును గమనించిన ఏడీఏ సస్యరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. కందిలో మంచి పూత రావడానికి ప్లానోఫిక్స్‌ను పంటపై పిచికారీ చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ఆర్బీకేను తనిఖీ చేసి రైతులతో సమావేశమయ్యారు. ఆర్బీకేల్లో రైతులకు కావలసిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేసుకుంటే పంటల బీమా, పెట్టుబడి రాయితీ, రైతు భరోసా వస్తాయన్నారు. ఏఓ మహబూబ్ భాష., ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

• ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి



హాజరైన పింఛన్ లబ్ధిదారులు



గుత్తిలో మాట్లాడుతున్న గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం రూ.3 వేలకు పింఛన్ మొత్తాన్ని ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాస రెడ్డి, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతి రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ వరలక్ష్మి, మార్కెట్ యార్డు చైర్మన్ సునీలా యాదవ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో రోజురోజుకూ సీఎం వైఎస్ జగన్ పట్ల ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ ఊపు చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ కోరుకున్నట్లు 175 ఎమ్మెల్యే స్థానాలకు 175 స్థానాలను గెలిచి తీరుతామనే నమ్మకం ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 66 లక్షలకు పైగా పింఛన్లు ఇస్తున్న రాష్ట్రం మనదేనన్నారు. మరోసారి సీఎంగా జగన్‌ను తెచ్చుకుంటే రాష్ట్రం, మనం అభివృద్ధి చెందుతామన్నారు. ఎమ్మెల్యే ప్రసంగిస్తున్న సమయంలో పింఛన్ లబ్ధిదారులు, పార్టీ శ్రేణుల నుంచి విశేష స్పందన లభించింది. సర్పంచు బేడల లక్ష్మీదేవి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్దన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, సీపీ రంగారెడ్డి, కొత్తపేట రాము, న్యాయవాది బుసా సుధీర్‌రెడ్డి, కౌన్సిలర్లు వరదరాజులు,వాల్మీకి శివ, నరేష్, ఫరూక్, అరవింద బాబు, వెంకట సుబ్బయ్య, కేవీ రమణ , ఖాజా ఖాన్, సీనియర్ నాయకులు వెల్డింగ్ రవూఫ్, సుధాకర్, భీమలింగ, మల్లికార్జున, పట్టణ ఉపాధ్యక్షులు శివ, హరినాథ్‌రెడ్డి,షఫి, పురుషోత్తం, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుపై లబ్ధిదారుల హర్షం

గుంతకల్లు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచడంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గురువారం పులగుట్టపల్లి పెద్దతండాలో పింఛన్ లబ్ధిదారులు కేక్‌ను కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ అహర్నిశలూ ప్రజల కోసమే పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేశారు. మరోసారి జగనన్ననే రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయడమే తమ లక్ష్యం అని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామ పెద్దలతో పాటు పోలింగ్ ఏజెంట్ చిన్నస్వామి నాయక్, సోమ్లానాయక్, రత్నానాయక్, శీనానాయక్, లాలు నాయక్, శ్రీకాంత్ నాయక్, మునినాయక్ , సుంకా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుందాం

పెద్దపప్పూరు: ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న జగనన్ననే మరోసారి సీఎంగా చేసుకుందామని ఎంపీపీ వెంకట్రామిరెడ్డి (రామయ్య) అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 165 పింఛన్లతో పాటు రూ.3000కు పెంచిన పింఛన్‌మొత్తాన్ని ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వస్తేనే మళ్లీ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముచ్చుకోట అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు హాజీవలి, వైఎస్సార్ టీయూసీ కమిటీ జనరల్ సెక్రటరీ షేక్‌పల్లి నాగిరెడ్డి, జాయింట్ సెక్రటరీ జనార్దన్‌రెడ్డి, సర్పంచ్ ఓటుశమ్మ, అశ్వత్థం ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ లక్ష్మానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓఆర్డీ కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ప్రతి పేదోని ముఖంలో చిరునవ్వు చూడడమే జగనన్న లక్ష్యమని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ పింఛన్ కానుక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలకు పింఛన్ పెంచారన్నారు. మండల స్పెషలాఫీసర్ శ్రీదేవి, ఏఓ శ్రీవాణి, సాకే లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాలన సాగిస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్.జగన్ అని వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి, హీరాపురం ఫయాజ్‌బాషా పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పట్టణంలోని కృష్ణాపురం 1వ రోడ్డు, 2వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను పేదల ఇంటి ముంగిటకు చేర్చిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్.జగన్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిన్న నాగిరెడ్డి, నాయకుడు బ్రహ్మానందరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, వైస్ చైర్మన్ మహబుబ్‌బాషా, నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

పుట్లూరు: పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీ నెరవేర్చారని మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ అన్నారు. గురువారం మండలకేంద్రంలో పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 95 కొత్త పింఛన్లతో పాటు 5,890 పింఛన్లకు రూ.2750 నుంచి రూ.3 వేలకు పింఛన్లను ప్రభుత్వం పెంచిందన్నారు. సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగాలంటే జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, సర్పంచ్ ఓబుళేసు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని నాయనవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం కొత్తగా మంజూరైన వారికి పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత రంగస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చెప్పిన విధంగా పింఛన్‌ను రూ.3వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదినారాయణ, మునయ్య తదితరులు పాల్గొన్నారు.



జీకేఎస్‌లో పింఛన్ అందిస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్



తాడిపత్రిలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందిస్తున్న ఫయాజ్‌బాషా



పింఛన్‌దారులతో మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ



శింగనమల మండలం నాయనవారిపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



పెద్దపప్పూరులో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకట్రామిరెడ్డి

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకునే చెత్త సేకరణ



చెత్త సేకరణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



తాగునీటి కొళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకునే చెత్త సేకరణ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె నేపథ్యంలో పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిందన్న ఫిర్యాదులు అందడంతో స్పందించిన ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో 100 మంది కూలీలు, 50 ట్రాక్టర్లతో చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఏకకాలంలో చెత్త సేకరణ పనులకు శ్రీకారం చుట్టారు. భగత్‌సింగ్ నగర్‌లో ఎమ్మెల్యే చెత్త సేకరణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమ్మె పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె ముగిసే వరకు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్త సేకరణ పనులను కొనసాగిస్తామని వివరించారు.ఈ విషయాన్ని రాజకీయం చేయకుండా ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని కోరారు.

చెత్త సేకరణ పనుల అడ్డగింత

యల్లనూరు రోడ్డులో డివైడర్లలో వేసిన చెత్తను తాత్కాలిక కార్మికులు తొలగిస్తుండగా అక్కడికి చేరుకున్న మున్సిపల్ కార్మికులు గొడవకు దిగారు. చెత్తను ట్రాక్టర్లలోకి తరలిస్తుండడాన్ని అడ్డుకున్నారు. దీంతో అక్కడున్న స్థానికులు పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. మీరు చేయరు...ఇంకొకరిని చేయనీయరు అని కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి చెత్త సేకరణను అడ్డుకుంటున్న కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వం

తాడిపత్రిటౌన్: వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెలిపారు. మండలంలోని గదరగుట్టపల్లిలో అల్ట్రాటెక్ ఫ్యాక్టరీ సీఎస్ఆర్ నిధులు దాదాపు 6లక్షలతో ఇంటింటికి కొళాయి కనెక్షన్ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అంతా కలిసికట్టుగా మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి అయితేనే పేదలకు మంచి జరుగుతుందన్నారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళ్లరెడ్డి, నాయకులు మునిరెడ్డి, పీసీ రాజశేఖర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, పీ రాజశేఖర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, రాకేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బస్సుయాత్ర జయప్రదం చేయండి

గుత్తి: గుంతకల్లులో ఈ నెల 9న తలపెట్టిన సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు భవనంలో గురువారం వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బస్సు యాత్రకు పార్టీ శ్రేణుతో పాటు ప్రజలు, వైఎస్సార్, జగన్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలన్నారు. సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్దన్‌రెడ్డి, రంగస్వామి, సుభాష్‌రెడ్డి, బుస్సా సుధీర్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, జీవు రమణ, సుధాకర్, వరదరాజులు కటిక అన్వర్, నూర్ నాయక్, రవూఫ్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టంకడదాం

తాడిపత్రిటౌన్: సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగించుకుందామని ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. బొందలదిన్నె గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ఎంత ఇబ్బందులు పడ్డారో గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థతో వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీ ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

గుండెపోటుతో వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని బీటీ.పక్కీరప్ప కాలనీకి చెందిన ముల్లా బాబా ఫక్రుద్దీన్(61) గుండెపోటుతో మృతి చెందాడు. ఫక్రుద్దీన్‌కు 60 ఏళ్లు నిండటంతో రెండు నెలల క్రితం వార్డు కౌన్సిలర్, వలంటీర్ ద్వారా సచివాలయంలో వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. బుధవారం మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వార్డు కౌన్సిలర్ మెహరున్నీసా బేగం చేతుల మీదుగా పింఛన్ సొమ్ము అందుకున్నాడు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వైవీఆర్‌కు పూలమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. వేకువజామున ఛాతీనొప్పి రావడంతో కుటుంబసభ్యులు అతడిని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పింఛన్ మంజూరైనందుకు తమతో చాలా ఆనందంగా గడిపాడని, కానీ కొన్ని గంటలకే హఠాన్మరణం చెందడం జీర్ణించుకోలేకపోతున్నట్లు కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కౌన్సిలర్ మెహరున్నీసా, వార్డు ఇన్‌ఛార్జ్ పీఎస్.మస్తాన్ ఫక్రుద్దీన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు.



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న ఫక్రుద్దీన్(ఫైల్)

విద్యుత్ పరికరాల చోరీ

గుత్తి రూరల్: బసినేపల్లిలోని వ్యవసాయ తోటలో విద్యుత్ పరికరాలు చోరీకి గురైనట్లు బాధిత రైతు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు వెంకట్రాముడు రబీ సీజన్‌లో తనకున్న పొలంలో జొన్న పంట సాగు చేశాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తన పొలంలోకి ప్రవేశించి రెండు మోటార్ స్టార్టర్లు, విద్యుత్ తీగలు, 18 స్ప్రింక్లర్ పైపులు చోరీ చేశారు. వ్యవసాయ బోరు, మోటారు ధ్వంసం చేయడంతో సుమారు రూ.45 వేలు నష్టం వాటిల్లింది. రెండు రోజుల క్రితం తన పక్క పొలంలో విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయని రైతు తెలిపాడు. ఎస్‌ఐ నబిరసూల్ విచారణ చేపట్టారు.

ఎరువుల తయారీ కేంద్రం తనిఖీ



ఎరువుల తయారీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ రవి

శింగనమల: మండలంలోని లోలూరు క్రాస్ వద్ద నున్న భాస్కర్ ఎరువుల తయారీ కేంద్రాన్ని గురువారం అనంతపురం ఏడీఏ రవి , ఏఓ అన్వేష్ తనిఖీ చేశారు. ఎరువుల తయారీ, మార్కెటింగ్ లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, ఎరువుల గోడౌన్‌ను, ల్యాబ్‌ను పరిశీలించారు. ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు వ్యవసాయ ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఎరువుల తయారీ కేంద్రం మేనేజర్ శ్రీకాంత్‌కు సూచించారు. ఎరువుల తయారీ కేంద్రంలో ఎస్ఎస్‌పీ 51.25 టన్నులు, 22-0-11 ఎరువులు 93 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు మేనేజర్ తెలిపారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

యల్లనూరు: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను గురువారం మండల కేంద్రంలోని అమ్మవారిశాల నుంచి ఆంజనేయస్వామి గుడి వరకు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వాటిని ఇంటింటికీ పంపిణీ చేసినట్లు ఆర్యవైశ్య సంఘం రాఘవ, చైతన్య తదితరులు తెలిపారు.

కిడ్నీ బాధితురాలికి పింఛన్ అందజేత



పింఛన్ సొమ్ము అందిస్తున్న సర్పంచ్ పార్వతి

బుక్కరాయసముద్రం: స్థానిక సచివాలయం-4లోని ఇందిరా గాంధీ నగర్‌కు చెందిన బండారు రామక్కకు రెండు కిడ్నీలు చెడిపోయాయి. దీంతో వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.10 వేల పింఛన్‌ను సర్పంచ్ పార్వతి గురువారం అందజేశారు. ఈసందర్భంగా లబ్ధిదారురాలు పింఛన్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సర్పంచ్ పార్వతికి కృతజ్ఞతలు తెలిపారు. వార్డు మెంబర్ కుళ్లాయప్ప, అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం

బుక్కరాయసముద్రం: రైతులకు వ్యవసాయంతోపాటు పెరటి కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటి కోళ్ల పెంపకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకంతో రోజూ ఆదాయం పొందవచ్చన్నారు. పెరటి కోళ్ల పెంపకంలో జాగ్రత్తలు, డైరీ యూనిట్ల ఏర్పాటుపై సూచనలు చేశారు. అనంతరం రైతులకు పెరటి కోళ్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, డాక్టర్ చందన, ప్రభు మిత్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పామిడికి నేడు ఎమ్మెల్యే రాక

పామిడి: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే పింఛన్ల పెంపు, కొత్త పంఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హాజరు కానున్నారు. గురువారం ఈ మేరకు పామిడి పట్టణ, రూరల్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, బీ ఆషిఫ్, ఎం కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న అధికారులు

పామిడి: స్థానిక ఎమ్మార్సీ భవన ఆవరణలో గురువారం ఏపీటీఎఫ్-1938 క్యాలెండర్, డైరీని తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి, ఎంఈఓ-2 సత్యనారాయణ ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, రాష్ట్ర నేత సరిత, జిల్లా నాయకులు సూర్యనాగిరెడ్డి, రామాంజులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌రెడ్డి, అల్లాబకాష్, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మహేష్‌బాబు, రామ్మోహన్, రాజు, నారాయణస్వామి, మన్సూర్ అలి, రామకృష్ణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

పెద్దవడుగూరు: మండలంలోని అప్పేచర్ల, పెద్దవడుగూరు-1, క్రిష్టిపాడు -1 గ్రామ సచివాలయాల్లో గురువారం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, పీఈటీ లింగరాజు, రామచంద్రబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గార్లదిన్నె: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు.గురువారం కల్లూరులో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ వాహనదారులు పాటించాల్సిన నిబంధనలు వివరించారు. ఆర్డీటీ ఏటీఎల్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

పెద్దవడుగూరు : చిట్నూరు, చిత్రచేడు గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సాగింది. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఎంఈఓ రాముడు, ఏపీఎం ఈశ్వరయ్య ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

గుంతకల్లు రూరల్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి వివిధ రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు, ఓటరు కార్డులో మార్పులుచేర్పులు, తొలగింపులు తదితర వాటి కోసం 1,782 దరఖాస్తులను స్వీకరించామన్నారు. దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా ఓటరు జాబితా తయారు చేసేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ఓటర్లు ఆధార్‌తో ఓటరు కార్డును అనుసంధానం చేసుకునేలా రాజకీయ పార్టీల నాయకులు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లను చేపడతామన్నారు.